www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231



చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :33 | 31-05-2021 | పుటలు : 4





ప్రపంచ
పర్యావరణ దినోత్సవం



మీ చేతులతో ఒక మొక్కను నాటండి.ఆచరణలో భాగంగా దానిని సంరక్షించి పెంచండి.

- నన్నయ వాణి


# పలువురికి ఘన నివాళులు

## శ్రీనివాసరావు మృతికి నన్నయ నివాళి

### ఆన్లైన్‌లో సంతాప సభ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న అరిగెల శ్రీనివాసరావు(46) ఇటీవల కోవిడ్ తో మృతి చెందారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆన్లైన్ సంతాప సభను నిర్వహించారు. దీనిలో ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం క్యాంపస్ లో శ్రీనివాసరావు సీనియర్ అధ్యాపకునిగా విధులు నిర్వహించారని తెలిపారు. అధ్యాపకునిగా మాత్రమే కాకుండా అకౌంట్స్ విభాగంలో ఆయనకు ఉన్న ప్రతిభను గుర్తించి యూనివర్సిటీ అకౌంట్స్ విభాగంలో శ్రీనివాసరావు ఫ్యాకల్టీ అసోసియేట్ గా ఇటీవలే నియమించామని గుర్తు చేశారు. ప్రతిభ, పని యెడల నిబద్ధత ఉన్న వ్యక్తిని విశ్వవిద్యాలయం కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ఆయన మృతి క్యాంపస్ కు తీరని లోటు అని నివాళులర్పించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు ఆదరణ కలగాలని కోరుకుంటూ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు.




సంతాప సభలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

కోవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ కుటుంబ సభ్యులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ శ్రీనివాసరావు కామర్స్ అండ్ మేనేజ్మెంట్ అధ్యాపకునిగా విశేష సేవలు అందించారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ప్రిన్సిపాల్ మరియు కామర్స్ అండ్ మేనేజ్మెంట్ ఆచార్యులు ఎస్ టేకి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.పి.ఉమామహేశ్వరి విభాగ అధ్యాపకులు మరియు విశ్వవిద్యాలయ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది వారితో ఉన్న అనుభవాలను గుర్తుచేసుకుంటూ కన్నీటి నివాళులర్పించారు.

## నన్నయ పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య రఘుబాబు మృతి

నన్నయ విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్ (2013 -14) శ్రీకాకుళం డా.అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి పూర్వపు రిజిస్ట్రార్ గా సేవలందించిన, ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యా వ్యవహారాలకు డీన్ గా వ్యవహరించిన ఆచార్య రఘు బాబు కోవిడ్ కారణంగా మే 27 న కన్నుమూశారు. నన్నయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ గా విశేషమైన సేవలు అందించారని, విశ్వ విద్యాలయం రాజమండ్రి నుండి రాజానగరం సొంత స్థలంలోనికి వచ్చిన సందర్భంలో నాటి ఉపకులపతి కి ఎంతగానో సహకరిస్తూ కృషి చేశారని, అలాగే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సమర్ధులైన ఆచార్యులుగా పేరు పొందారని, ఆయన మృతి విశ్వవిద్యాలయాలకు ఎంతో లోటని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలియజేశారు. వీ.సీ.,రిజిస్ట్రార్, అధ్యాపకులు వారి సేవలను కొనియాడుతూ నివాళులర్పించారు.




## కాకినాడ పి.జి.సెంటర్ విశ్రాంత ఆచార్యుని మృతి

కాకినాడ ఎం.ఎస్.ఎన్. పిజి సెంటర్ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పి.వి.వి. సుబ్రహ్మణ్యం కోవిడ్ సోకటంతో మే 24న కన్నుమూశారు. పిజి సెంటర్ లో రాజనీతి శాస్త్రం మరియు ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగంలో సహాయాచార్యునిగా మూడు దశాబ్దాలు సేవలందించి ఉద్యోగ విరమణ చేశారు. కొంతకాలం చీఫ్ గార్డెన్ గా వ్యవహరించారు. బోధన, పరిశోధన రంగాల్లో విద్యార్థులపై ఆయన ఎంతో ప్రభావాన్ని చూపారు. విద్యార్థులతో సన్నిహితంగా వ్యవహరిస్తూ వారిలోని ప్రతిభకు మెరుగులు దిద్దారని వారితో కలిసి పనిచేసిన ఆచార్య ఇళ్ల దోసగిరిరావు, ఆచార్య ఏ. వెంకటరావు చెప్పారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు,రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కాకినాడ క్యాంపస్ ప్రత్యేక అధికారి డాక్టర్ ఎమ్.కమలకుమారి, అధ్యాపకులు సంతాపాన్ని తెలిపి నివాళులర్పించారు.



## రమేష్ రెడ్డి మృతికి సంతాపం




సంతాప సభలో మాట్లాడుతున్న వీసీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్‌గా విశేష సేవలందించిన డా.కె.రమేష్ రెడ్డి అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆన్లైన్లో సంతాప సభ నిర్వహించారు. వీ.సీ.ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారిగా రమేష్ రెడ్డి ఎంతో కీలక బాధ్యతలను నిర్వహించారని, ఆయన మృతి రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్ విభాగాలకు తీరని లోటని అన్నారు. రమేష్ రెడ్డి 15 సంవత్సరాల టీచింగ్ అనుభవంతో పాటు ఎన్ఎస్ఎస్‌లో క్రియాశీలక పాత్రను పోషించారని చెప్పారు. రమేష్ రెడ్డి సేవలకు నిదర్శనంగా జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ ఉత్తమ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ అవార్డు ( రాష్ట్రపతి అవార్డు) 2017-18, ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు 2016-17 లో అందుకున్నారని, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అవార్డు 2015-16, ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డులు 2014-15 లభించాయన్నారు. ఇటీవల విశ్వవిద్యాలయంలో జరిగిన అడ్వైజరీ కమిటీ మీటింగ్‌లో ఆయన పాల్గొని రాష్ట్రంలోని 290 ఎన్ఎస్ఎస్ యూనిట్లతో అతి పెద్ద ఎన్ఎస్ఎస్ విభాగంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చేస్తున్న సేవలను కొనియాడి పలు సూచనలు,సలహాలను అందించారని తెలిపారు. ఆయన మృతి రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్ కు తీరని లోటని నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు ఆదరణ కలగాలని కోరుకుంటూ ప్రగాడ సంతాపాన్ని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, రీజినల్ డైరెక్టర్ ఎం రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మరియు వివిధ విశ్వవిద్యాలయాల ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్లు, ప్రోగ్రాం అధికారులు రమేష్ రెడ్డి మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.



## నన్నయ సిబ్బందికి వ్యాక్సిన్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం కాకినాడ తాడేపల్లిగూడెం క్యాంపస్ 45 సంవత్సరాల వయసు పైబడిన సిబ్బందికి ఉచితంగా కోవిడ్ వ్యాక్సిన్ వేయించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ ప్రత్యేక పర్యవేక్షణతో రాజానగరం ప్రభుత్వ పాఠశాలలో వైద్య సిబ్బంది ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను నిర్వహించారు. త్వరలో విశ్వవిద్యాలయం సిబ్బంది అందరికీ టీకాలు వేయిస్తామని వీసీ తెలియజేశారు.

# సంపాదకీయం



## ప్రకృతిః పంచభూతాని...

సునామీలు, తుఫాన్లు, భూకంపాలు, వ్యాధులు, వైరస్లు...ఇలా ప్రపంచంలో ఏదో ఒక మూల భూభాగంపై వినాశనం జరుగుతూనే ఉంది. భూభాగంపై వేడి పెరిగిపోతోంది. ప్రపంచ పర్యావరణంలో మార్పులు నిరంతరం సంభవిస్తూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సముద్రాల్లో నీటి మట్టం వేగంగానే పెరుగుతుంది. హిమాలయాల్లో హిమానీ నదులు నలభై శాతం కరిగిపోయాయి. తీర ప్రాంతాలను తాకే తుఫానుల వేగం పెరగటమే కాదు, తాకిన ప్రతిసారి వాటి తీవ్రత కూడా అధికమవుతుంది. పర్యావరణం అతి భయంకరంగా మారిపోవడం వెనుక మానవుడు ప్రకృతితో చెలగాటమాడటమేనని శాస్త్రవేత్తలు నిరూపిస్తున్నారు. మనిషి ప్రకృతిని, జంతుజాలాన్ని నాశనం చేస్తూ తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కునే పనిలో ఉన్నాడని తెలుస్తుంది.

పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావంతో మానవజాతి కనీవినీ ఎరుగనంతగా అటవీ సంపద అదృశ్యమైంది. వాణిజ్య విస్తరణలో లక్షలాది జంతుజాలం, పశుపక్షాదులు, సాగరజీవులు వ్యాపారుల చేతుల్లో హతమయ్యాయి. కాలుష్యం తెరచాటున కాలం గడుపుతున్న జగత్తు మనది. ఆయిల్, క్రిమిసంహారక మందులు, వాయు కాలుష్యం, పరిశ్రమల వ్యర్థాలు, వాడి పడేస్తున్న ప్లాస్టిక్.... ఇవే లోకాన్ని కాలుష్యంతో నింపుతున్నది. నదుల్ని, కాలువల్ని మురికి కూపాలుగా మారుస్తున్నాం. మానవ ఆరోగ్యాన్ని మంట కలుపుతున్న గొప్ప అభివృద్ధి ఇదే. గత యాభై ఏళ్లుగా మనిషి ఈ భూమి రూపురేఖల్ని ఇంతకు ముందెన్నడూ లేని స్థాయిలో వేగంగా మార్చేశాడు.మహీతలాన్ని మంటల్లోకి గెంటేస్తున్న మానవుడు తాను ఆ మంటల్లోకి పడబోయే స్థితిలో ఉన్నాడు.


మన పూర్వులు ఈ భూమిని తల్లిగా భావించారు. ప్రాతఃస్మరణలో ప్రార్థించారు. ప్రకృతిలోని పంచభూతాలు, అంతరిక్షం,గ్రహాలు... ఈ విశ్వమంతటికీ శుభం జరగాలని కోరుకున్నారు. విశ్వ శ్రేయస్సును ఆకాంక్షించారు. పరమాద్భుత తత్వాన్ని తనలో నిబిడీకృతం చేసుకున్న పుడమి మానవునికి ఆవాసమై జీవికనిచ్చింది. ఈ భూమి మీద ఉన్న నదులు, సముద్రాలు, ఆకాశ మార్గాలు, మేఘాలు, పర్వతాలు దేశాలను వేరు చేస్తున్న సరిహద్దులు కావు. సమైక్యం చెయ్యగల మైత్రీ బంధాలు. విశ్వజనీనమైన మానవ జీవితానికి ఆదర్శ భావనలు.ఆ దృష్టితోనే మన పూర్వులు సకల ప్రకృతిని, ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా, అఖండంగా, పవిత్రంగా, పరమాత్మతత్వంగా దర్శించారు.

అలా దర్శించుకోగలిగిన మానసిక స్థితి వేగవంతమైన అభివృద్ధిలో ఉన్నానని మోసపోతున్న నేటి మానవునికి సంప్రాప్తించి పర్యావరణం రక్షింపబడితే సమస్త ప్రాణులు రక్షింపబడతాయి.

సదా కుర్వంతు మంగలమ్!!

# సాగరఘోష - పర్యావరణ కావ్యం పుస్తకం







సాగర ఘోష విశ్వ కావ్యం. విశ్వ శ్రేయస్సును ఆకాంక్షించే సమగ్ర మహాకావ్యం. మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు గారు రచించారు. భూమి చరిత్రే ఈ కావ్యంలో ఇతివృత్తం. మానవుడే ఇందులో నాయకుడు. ఇది మనిషి కథ. కోట్ల ఏళ్ల నాటి భూమి పుట్టుక నుండి నిన్న మొన్నటి గుజరాత్ భూకంపం వరకు ఇంచుమించుగా మానవుని మహాప్రస్థానం లోని అన్ని సంఘటనలు ఈ కావ్యంలో చోటుచేసుకున్నాయి. ప్రధానంగా ఇది పర్యావరణ పద్యకావ్యం. మనిషి భౌతిక పరిసరాలను అందంగానూ, ఆనందదాయకంగానూ తీర్చిదిద్దుకోవాలని, మనసులో స్వార్థాన్ని తగ్గించుకుని పరమార్థం గురించి ఆలోచించాలని తెలియచెప్పే కావ్యమిది. ఆది శంకరాచార్యుని అద్వైత సిద్ధాంత నేపథ్యంలో అన్ని దేశాల సాంస్కృతిక చరిత్ర ఘట్టాలను పరిశీలించి విశ్లేషించిన 1116 పద్యాలతో నిండిన కావ్యం.

ఒకానొక ప్రౌఢ వయస్కుడైన కవి సాగర తీరంలో కూర్చుని సముద్రాన్ని వర్ణిస్తూ తన్మయ స్థితిలో ఉంటాడు. ఇంతలో ఒక పిల్ల కెరటం ఒడ్డుకు వచ్చి ఆ కవి ఒడిలోనికి వాలుతుంది. తన ఒడిలోనికి వచ్చినట్లుగా భావించి ఆ కవి కెరటాన్ని ప్రేమగా చేరదీస్తాడు. లాలిస్తూ దాని ఒళ్ళంతా నిమురుతూ ఉంటే దాని వీపంతా జిడ్డుగా మడ్డిగా కనిపిస్తుంది. "స్వచ్ఛంగా ఉండవలసిన నీటి కెరటానివి,ఇలా ఉన్నావేమిటి?" అని ప్రశ్నిస్తాడు. తాను ఇరాక్ తీరం నుండి కొట్టుకు వస్తున్నానని సద్దాం హుస్సేన్ సముద్రంలో ఆయిల్ పారబోసినప్పటి నుండి తన పరిస్థితి ఇలా అయిందని కెరటం వాపోతుంది. తాను కొద్దిరోజులు కవి ఒడిలోనే విశ్రాంతి తీసుకువెళతానని అర్థిస్తుంది.మర్యాదలు చేసి, జోలపాడి నిద్రపుచ్చుతాడు. తరంగం మేల్కొన్న తరువాత అది తిరిగివచ్చిన తీరాలలోని విశేషాలను చెప్పమని అర్థిస్తాడు. అప్పుడా కెరటం చెప్పిన మానవుని జీవిత కథే ఈ సాగరఘోష. ఇది భౌతిక మానసిక పర్యావరణ పద్యకావ్యం. యావత్ ప్రపంచ దేశాల సాంస్కృతిక చరిత్రను భారతీయ తాత్విక చింతనా నేపథ్యంలో వర్ణించే ఈ కావ్యరచన మంచి కోసం! మార్పు కోసం!! మనిషి కోసం!!!

వాల్మీకి శ్లోకానికి శోకం మూలం అయితే, ఈ కావ్య నిర్మాణానికి మూలం కాలుష్యం. విజ్ఞాన పరిశోధనలతో విపరీత మనస్తత్వంతో స్వచ్ఛమైన ప్రకృతిని వికృత రూపిణిగా మార్చవద్దని నిజావేశంతో ప్రపంచ ప్రజానీకాన్నీ ఉద్దేశిస్తూ మహాకావ్య శంఖారావం చేశారు శ్రీ గరికపాటి. శాశ్వత ప్రకృతి సత్యాలు,సృష్టి ధర్మాలను రసవత్తరంగా ధ్వని పూర్వకంగా, అనుభూతి ప్రధానంగా, హృద్యంగా, అమృత మధురంగా వెలువడిన సత్కవితా శిల్పం.ప్రపంచ చరిత్రని తన మేధా సంపత్తితో, తాత్విక దృష్టితో,మానవత్వంతో ఆకళింపు చేసుకున్న సత్కవి ప్రత్యేక దృక్కోణం.

**- శ్రీపాద సుందరశర్మ,రాజోలు.**



## మంచి మాట

అజ్ఞాని మనస్సు అతని నాలుకలో ఉంటుంది.

జ్ఞాని నాలుక అతని హృదయంలో ఉంటుంది.

-గౌతమ బుద్ధుడు

# ఆకుపచ్చ గుండె

**పర్యావరణ కవితామాలిక**

మట్టి కప్పుకొని పడుకున్న ప్రతీ విత్తనాన్ని స్పృశించి,ప్రాణం పోయాలని,మబ్బులనుండి జారే ప్రతీ చినుకు కోరుకుంటుంది.ప్రతీ విత్తనం మొక్కగా రూపాంతరం చెందాలని,అలాగే ప్రతి ప్రాణి దాహం తీర్చడం తన కర్తవ్యమని మబ్బుల సైన్యాన్ని నలువైపులా విస్తరింప చేసి వర్షించుటకు వస్తుంటాయి..
కానీ విష బాణాల్లా,కర్మాగారాలు కాలుష్య పొగతో అడ్డుకొని మబ్బుల్ని ముక్కలు ముక్కలుగా చేసి చినుకు రాలకుండా అడ్డుపడుతున్నాయి..
ప్రతి పవనం కురవలేక పోతున్నందుకు బాధతో నిరాశ బరువులను మోస్తున్నాయి.
చెట్లు లేకుండా మేఘం వర్షించలేదు.
చెట్టు కొమ్మలు రమ్మని పిలిచినప్పుడే మేఘం వస్తుంది.
చెట్లు నరకడం ఆపకుండా
ఎన్ని మేధోమధనాలు చేసినా వృధా ప్రయాసే.
కాలుష్యంతో పర్యావరణాన్ని నాశనం చేస్తూ, కృత్రిమ జీవనం సాగిపోతూ వుంటే మన మనుగడ శ్మశానమే అవుతుంది.
ప్రకృతికి అనువుగా జీవించడం మానవాళికి క్షేమం.
ఓజోన్ పొరకు చిల్లు పడిందని ఆందోళన చెందుతున్నాము.
పరిమితులు లేకుండా ప్రకృతిని కొల్లగొడుతున్నాం.
పంట పొలాల్లో రకరకాలుగా వినాశకాల వ్యాపారాలు,రొయ్యల చేరువులతో విషపూరితం చేస్తున్నాం.
దేశమంతా అడవుల నరికివేత నిత్యకృత్యంగా చేస్తూ, ప్రకృతి సమతుల్యం దెబ్బతిని, అతివృష్టి, అనావృష్టి నెలకొక్క తుఫానుల పరిస్థితి వచ్చింది..
ప్రకృతి ని జయించడం అంటే మనం కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే.
అన్ని రకాలుగా అందరూ ఆకుపచ్చ గుండెను మాడ్చి మసి చేస్తున్నారు.
చివరకు స్వచ్ఛమైన గాలి,నీరూ లభించక అవి అపురూపం కావడం ఖాయం..
ఇప్పటికే ఆ పరిస్థితుల్ని రుచి చూస్తున్నాం.
మన మంతా మరో భూతాన్ని పెంచి పోషిస్తున్నాం..ప్లాస్టిక్..
అది పుట్టి వందేళ్లు అయ్యిందేమో.
అది ఏ తపస్సు చేయకుండానే మనం దానికి వెయ్యేండ్ల ఆయుష్షును ప్రసాదించాం.
మన కోసం మనం తయారుచేసుకున్న ఈ ప్లాస్టిక్ నేడు భస్మాసుర హస్తమై మన కొంపలు ముంచుతున్నా,దాన్ని వదిలి పెడతలేము.
ఆఖరికి మన శరీరం లోకి కూడా చేరుకుంది..
మొత్తం ప్రాణకోటిని అమాంతం మింగేయడానికి సిద్ధమౌతున్న ఈ ప్లాస్టిక్ భూతాన్ని వదిలించుకోవడానికి ప్రతి ఒక్కరూ ఓ మాంత్రికుడు కావాల్సిందే.
అది అంత తేలిక కాదు..
కానీ తప్పదు.
మనం వాడి పారేసిన ప్లాస్టిక్ నేడు మనల్ని పారేస్తుంది.
అంతటా విస్తరించిన ప్లాస్టిక్..
చివరికి మన రక్తంలో ఎంత ఉందో అని పరీక్షలు చేసుకునే పరిస్థితి వస్తుందేమో.
మనం రోజూ సూక్ష్మ రూపం లో ప్లాస్టిక్ ను తింటున్నాం..తాగుతున్నా%శీ.
%ఒకసారి వాడి పారేసిన దాన్ని మనం మళ్ళీ మళ్ళీ వాడుతున్నాం.
మన దేశంలో ఒక్క సిక్కిం లోనే ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలౌతుంది.
ఆ ఆదర్శం మిగతా రాష్ట్రాలు..
ముఖ్యంగా ప్రజల్లో,ప్రభుత్వం లో మార్పు రావాలి.
అప్పుడే పర్యావరణ పరిరక్షణ.. చేసినవాళ్లం అవుతాం.

-లోడె రాములు..స్వాములవారి లింగోటం, యాదాద్రి, భువనగిరి.




ఎఆర్ఎన్ఎస్ తనూజ ఎంసిఎ




వై.కీర్తన, బిటెక్, ఇఇఇ

## పర్యావరణ చిత్రమాలిక




డి.కృప, ఫస్ట్ ఎంఎస్సి, బోటని




వై.సత్యశ్రీ, బి.ఇడి, నన్నయ




## ప్రతిభా వాణి

# శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య

**(1906 - 2003)**



గోపాలకృష్ణయ్య గారు 13 సంవత్సరాల చిన్న వయసులోనే తిలక్, గాంధీ ఉపన్యాసాలకు ప్రభావితులై భారత స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్ బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘనం, క్విట్ ఇండియా ఉద్యమం.. అనేక ఉద్యమాలలో పాల్గొని 14 సార్లు అరెస్టై ఏడుసార్లు కఠిన కారాగారశిక్ష అనుభవించారు. స్వాతంత్రోద్య మం తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం, విశాలాంధ్ర ఉద్యమం, గ్రంథాలయోద్యమం, రైతాంగ ఉద్యమం,మద్యపాన నిషేధ ఉద్యమాలలో పాల్గొన్నారు. చివరి క్షణం వరకూ తెలుగువారి కోసం, తెలుగు భాష అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన యోధుడు. గొప్ప మానవతావాది. ఎనిమిది దశాబ్దాల పాటు అవిశ్రాంత పోరాటం జరిపిన మహోన్నత గాంధేయవాది. మచ్చలేని ప్రజా ప్రతినిధి. సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ప్రజా సమస్యల పట్ల పోరాడారు.

అధికార భాష తెలుగు అమలు కోసం కృషి చేసి అధికార భాషా సంఘం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఆయనను ఆ సంఘానికి ప్రథమ అధ్యక్షునిగా నియమించింది. ఆ హోదాలో తెలుగు భాష వినియోగానికి ఎంతగానో కృషి చేశారు. ఆ పదవికి క్యాబినెట్ మంత్రి హోదా కల్పించినా ఆ పదవిలో పనిచేసిన మూడు సంవత్సరాలు నెల జీతంగా ఏమీ తీసుకోకుండా, అధికార వాహనాలను వాడకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యటించి పత్రిభుత్వ,ప్రజా కార్యకలాపాలలో తెలుగు భాషను వినియోగించేలా కృషి చేశారు.

వావిలాల వారు గొప్ప గ్రంథ రచయిత. అనర్గల ఉపన్యాసకులు. గొప్ప సాహితీవేత్త. సుమారుగా 60 గ్రంథాలకు పైగా రాశారు. అనేక పత్రికలకు వందలాది వ్యాసాలు రాయటం ఆయన దినచర్యలో ఒక భాగం. సబ్ ఎడిటర్ గా, ఎడిటర్ గా సేవలందించారు. ఆంధ్ర, వెంకటేశ్వర,ఉస్మానియ, నాగార్జున విశ్వవిద్యాలయాలకు సెనేట్ సభ్యునిగా సేవలందించారు. విద్యారంగానికి ఆయన చేసిన కృషికి ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. భారత ప్రభుత్వం పద్మభూషణ్ తో సత్కరించింది.

చేతిలో చిన్న ఖద్దరు సంచితో ఎంతటి బహిరంగ సభకైనా హాజరయ్యే వావిలాల ఒక జత ఇస్త్రీ లేని ఖద్దరు బట్టలు ఆ సంచిలో ఉంచుకుని రైల్లో రెండవ తరగతి స్లీపర్ కోచ్ లో ఎంత దూరమైనా ప్రయాణించే వారు. వివాహం చేసుకుంటే ప్రజాసేవకు ఆటంకమని భావించిన ప్రజల మనీషి. నిరాడంబరమైన ఆ మహనీయుని తెలుగు దినపత్రికలు చివరి గాంధీగా, తెలుగు నేలకు పెద్దదిక్కుగా, మరో మహాత్ముడిగా ఉద్యమ జ్వాలగా అభివర్ణించాయి. ఆ మహనీయునికి నన్నయవాణి అక్షర నీరాజనాన్ని సమర్పిస్తోంది.

# పర్యావరణ కాలుష్యం-సంరక్షణ

భూమి, నీరు, గాలి మొదలైనవాటితో మనిషికి ఉండే అవినాభావ సంబంధమే పర్యావరణం.కాబట్టి పర్యావరణం అంటే పరిసరాల వాతావరణమని అర్థం. పరిసరాల వాతావరణం కలుషితం కాకుండా కాపాడుకోవడమే పర్యావరణ సంరక్షణ అనబడుతుంది.

ప్రాణులు నివసించేది నేల పైన గదా! ఆ నేల తల్లిని సరిగా చూసుకోవాలి. భూమిపై చెత్త, చెదారమేకాదు ,ఔషధలు ఉంటాయి.చెట్లు ఉంటాయి. జంతువులు ఉంటాయి.మనం జీవించడానికి ఆహారం లభించేది భూమి వల్లనే గదా! రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి నిస్సారమైపోతుంది. భూమిని ఆరోగ్యంగా ఉంచాలి.భూమి సమతుల్యాన్ని పోషించాలి.

జల కాలుష్యం మిక్కిలి భయంకరమైనది. రసాయనిక పదార్థాలు,పరిశ్రమల వల్ల విడుదలయ్యే ద్రవ పదార్థాలు సాగునీటిని,త్రాగే నీటిని కాలుష్యపరుస్తాయి. మురుగునీరు,త్రాగే నీరు అనే బేధం లేకుండా పోతుంది. డ్రైనేజీ వ్యవస్థ ఆరోకరగా ఉంది.దీనివల్ల కలరా, మలేరియా, ఫ్లోరోసిస్, విషజ్వరం, టైఫాయిడ్ వంటివేకాక వైద్యులకి అంతుపట్టని కొత్త రోగాలు కూడా బయలుదేరాయి.

ఇక వాయు కాలుష్యం, గాలి వల్లనే మనం జీవిస్తున్నాం. అటువంటి గాలి స్వచ్ఛంగా ఉండాలి.కానీ ఆధునిక పారిశ్రామీకరణ పేరుతో గాలి కూడా కలుషితమైపోతుంది. విషపూరితమైన గాలి పీల్చడంవల్ల ఊపిరితిత్తులు, జీర్ణకోశం,గుండె అనారోగ్యానికి గురై ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జీవితం రోగాల మయం అవుతుంది.

యంత్రాల వల్ల, వాహనాల వల్ల ధ్వని కాలుష్యం వ్యాపిస్తుంది. అణుశక్తి పరీక్షలవల్ల కూడా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. 1970లో అమెరికాలో పర్యావరణ పరిరక్షణ ఉద్యమం బయలుదేరింది.వాటి నుంచి శాస్త్రజ్ఞులు పర్యావరణ కాలుష్య నివారణకు విశేషమైన కృషి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జూన్ ఐదవ తేదీన పర్యావరణ దినోత్సవంగా పాటిస్తున్నారు. పర్యావరణ వ్యవస్థ లోని సమతుల్యాన్ని కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలి. ఆచరణలో చూపాలి.

**-ఇంద్రావత్ రాహుల్**
**కొత్తపేట్, నిజామాబాద్**

# పర్యావరణమే ప్రాణవాయువు

## పర్యావరణ లఘు వ్యాసాలు

ఒక చెట్టు తన జీవితకాలంలో ఇచ్చే ఆక్సిజన్ విలువెంత? మానవులందరు విస్మరించిన ఆ విలువను లెక్కించాల్సిన సమయం వచ్చింది.

**-మాజీ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఏ.బాబ్డేతో కూడిన త్రిసభ్య ధర్మాసనం చేసిన వ్యాఖ్యలివి.**

నిజమే, పర్యావరణాన్ని మృత్యుపాశవరణంగా మార్చేస్తున్న సమస్త మానవ ప్రపంచం ఒక్క క్షణం ఆగి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. సర్వప్రపంచాన్ని వణికిస్తూ మహా విపత్తుగా పరిణమించిన కరోనా వైరస్ రెండో దశలో భారతదేశంపై తన ఉధృతిని చూపిస్తూ ప్రజల ఊపిరిని తీస్తుంది. ఇప్పటికి పది లక్షలమంది రోగులు ఆక్సిజన్‌పై వుండి ప్రాణాలతో పోరాడుతున్నారు. అనేకమంది ఆక్సిజన్ అందకమరణించారు.

సెప్టెంబర్ 23,2019 ఐక్యరాజ్యసమితి పర్యావరణ సదస్సులో నా కలల్ని, నా బాల్యాన్ని మీరు దొంగిలించారు, మీవి వట్టి మాటలు, మొత్తం పర్యావరణం ధ్వంసమైపోతుంది. 'హౌ డేర్ యు' అంటూ 16 సంవత్సరాల బాలిక గ్రెటా థన్ బర్గ్ ప్రపంచ దేశాధినేతలు ప్రశ్నించింది. ఈరోజు భారత్ లో అనేకమంది ప్రజల కలలు, జీవితాలు ఆక్సిజన్ అందక కనుమరుగై పోయాయి.

భారతదేశం సుసంపన్నమైన దేశం పచ్చదనంతో పర్యావరణ వనరులతో జీవనదులతో జీవవైవిధ్యంతో కూడిన దేశంగా గర్వంగా చెప్పుకునే మనం ఈరోజు ఆక్సిజన్ కోసం ప్రపంచదేశాలవైపు దీనంగా చూడాల్సిన పరిస్థితి ఎదురైంది. ప్రపంచ సగటు కన్నా తక్కువుగా మనదేశంలో 21 శాతం అడవులు మాత్రమే ఉండడం మనకి మనం ఆలోచించాల్సిన విషయం. దీనికి కారణం ఎవరు ప్రభుత్వాలా? పాలకులా? లేక మనమందరం బాధ్యులమేనా?

వేలసంవత్సరాలుగా భూమిపై నివసిస్తున్న సమస్త జీవరాశి మానవ నాగరికత మనగడ సాగించాలంటే ఈ భూగోళం దానిపై వుండే పర్యావరణం పదిలంగా ఉండాలి. ఆదిమ మానవుడి నుంచి నేటి అత్యాధునిక సమాజం వరకు ప్రకృతి పర్యావరణం అనేక సవాళ్ళను ఎదుర్కొంటూ మానవజాతికి సర్వజీవరాశికి తన జీవఫలాలు అందిస్తుంది. కానీ...మనం పర్యావరణాన్ని, ప్రకృతి గమనాన్ని, సహజ వనరులను ధ్వసంచేసి అదే శాస్త్రవిజ్ఞానం, అభివృద్ధి,

ప్రగతి అని మనకి మనమే ప్రమాదాన్ని తెచ్చుకుంటున్నాం.

చివరగా ఒక్కమాట!!

భారత రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాల్లో 48%గా% అధికరణ ప్రకారం , పర్యావరణాన్ని పరిరక్షించడానికి , అడవులు కాపాడానికి రాజ్యం , ప్రభుత్వం కృషి చేయాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచదేశాలు ఎన్నో చట్టాలు సదస్సులు ఏర్పాటుచేశాయి. కానీ వాటి అమలులో వైఫల్యం చెందాయి. ఇప్పటికైనా పర్యావరాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత పౌర సమాజం పై వుంది.

పంచభూతాలను సక్రమంగా వినియోగించుకుంటే సర్వ మానవాళి క్షేమం, అక్రమంగా అతిగా వినియోగించుకుంటే భవిష్యత్ తరాలకు అన్యాయం , సమస్త సృష్టికి వినాశనం.

**- కురమా సంపత్ కుమార్.**
**(నన్నయ పూర్వ విద్యార్థి )**
**అధ్యాపకులు,కొండవీటి డిగ్రీ కళాశాల,గోపాలపురం.**

# గొప్ప పర్యావరణవేత్త- సుందర్లాల్ బహుగుణ


పర్యావరణ పరిరక్షణలో ప్రపంచవ్యాప్త ఉద్యమకారుల్లో సుందర్ లాల్ బహుగుణ ముఖ్యులు. 1927లో జన్మించారు .కరోనా బారిన పడి ఈయన ఎయిమ్స్-రిషికేష్ ఆస్పత్రిలో 2021/ మే/ 21న మరణించారు. భారతదేశం గొప్ప పర్యావరణవేత్తను కోల్పోయింది.

ఈయన చిప్కో ఉద్యమానికి నాయకత్వం వహించి చెట్టు, జంతువులు, పక్షులు, పర్యావరణం, మానవ సమాజం అంటూ అందరికీ అర్థమయ్యే రీతిలో చిప్కో ఉద్యమాన్ని చేపట్టాడు. హిమాలయాల్లో అడవుల సంరక్షణ కోసం పోరాడారు.

చిప్కో ఉద్యమం తో సంబంధం ఉన్న ప్రజలతో కలసి పెద్ద పెద్ద ఆనకట్ట లకు వ్యతిరేకంగా మరియు పర్యావరణ సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ప్రారంభించారు. వృక్షాలే కాదు అంతరించిపోతున్న జంతు, పక్షి జాతుల పరిరక్షణ కోసం పరితపించడాయన. చెట్లను, అటవీ ప్రాంతాలను, అటవీ కాంట్రాక్టులు నరికి వేయకుండా కాపాడే ప్రయత్నంలో "చిప్కో ఉద్యమం "1974 మార్చి 26న ఉత్తరప్రదేశ్లో ఆకస్మికంగా ప్రారంభమైంది. హిందీలో అంటే కౌగిలింత లేదా ఆలింగనం అని అర్థం"చెట్లను కొట్టి వేస్తున్నప్పుడు ప్రజలు చెట్లను పట్టుకుని కౌగిచుకోవడం, చెట్లను నరకనివ్వకుండా కాపాడుకున్నారు. శాంతియుతంగా చేపట్టిన మహత్తర ఉద్యమమే చిప్కో ఉద్యమం. కర్ణ ప్రయాగ అనే ప్రాంతం దగ్గర అడవుల్లో చెట్లను కొట్టి వేసి ఫైన్ చెట్లను పెంచుదాం అన్ని ప్రభుత్వ అధికారులు ప్రయత్నించినప్పుడు అక్కడి ప్రజలతో కలిసి విజయవంతంగా నిరోధించారు. ఇలా సుందర్ లాల్ బహుగుణ నేతృత్వంలో చిప్కో ఉద్యమం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ అంతటా వ్యాపించింది. గిరిజనుల అడవులను సంరక్షించుకోవలనే లక్ష్యంతో ఈ ఉద్యమం మొదలైంది .మొదట చెట్లను రక్షించే ఉద్యమంగా తర్వాత పర్యావరణ పరిరక్షణ ఉద్యమంగా రూపు దిద్దుకుంది.

చిప్కో ఉద్యమం తర్వాత కర్ణాటకలోని అప్పికో ఉద్యమానికి ప్రేరణ నిచ్చింది. చిప్కో ఉద్యమం పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషిలో ఒక్కటిగా నిలిచిపోయింది.

పర్యావరణాన్ని పరిరక్షించడానికి, ప్రపంచవ్యాప్తంగా కొనసాగిన అనేక ఉద్యమాల్లో ఈ ఉద్యమం ప్రథమ స్థానంలో




నిలిచింది. ఈ ఉద్యమంలో భాగంగా సుందర్లాల్ బహుగుణ 1981–19 83 మధ్య హిమాలయా పర్వత సానువుల్లో చెట్ల నరికివేతను నిషేధిస్తూ ప్రభుత్వం చట్టాన్ని అమల్లోకి తీసుకుంది.ఈ ఉద్యమం వల్ల దేశ వ్యాప్తంగా అడవుల సంరక్షణ కోసం పలు చట్టాలు అమలులోకి వచ్చాయి. ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాజస్థాన్, బీహార్ దక్షిణాది విస్తరించిన పశ్చిమ కనుమల్లో అడవుల నరికివేతను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాయి.పర్యావరణాన్ని కాపాడటం మన అందరి సహజ హక్కుగా పరిగణించండి. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుని బాధ్యత.

**- ఏ.జె.ఎస్.దీప్తి.**
**ఆదికవి నన్నయవిశ్వవిద్యాలయం**
**బి.ఏడ్ (ద్వితీయ)**

# పర్యావరణ పరిరక్షణ

మానవ మనుగడకు అత్యంత ప్రాముఖ్యమైంది పర్యావరణం. అటువంటి పర్యావరణం నేటి రోజుల్లో మానవ అవసరాల నిమిత్తం ప్రకృతిని మానవుడు తన చేతులతో తాను నాశనం చేస్తున్నాడు. పర్యావరాన్ని ఉపయోగించుకుంటే నాశనం కాదు. కానీ విలాసవంతమైన సౌకర్యాల కోసం ఉపయోగిస్తే నాశనం అవుతుందని మనం గమనించాలి. పర్యావరణం అనగా మన చుట్టూ వున్నా పరిస్థితులు.పర్యావరణాన్ని మనం సంరక్షించుకోగలిగినప్పుడు మన ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపరుచుకోగలం.

**పర్యావరణ క్షీణతకు కారణాలు**

వాయు కాలుష్యం : మానవ జీవితానికి గాలి చాల ప్రాముఖ్యం. గాలి లేనిదే సమస్త జీవరాశి ఉనికి ఉండదు. అటువంటి స్వచ్ఛమైన గాలి పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం కారణంగా, వాహనాల ద్వారా వెలువడే కార్బన్ డై ఆక్సైడ్ వలన గాలి కాలుష్యం జరిగి ప్రకృతిని దాని సహజ స్వభావాన్ని దెబ్బతీస్తుంది.మానవుని అవసరాల నిమిత్తం నేటి రోజుల్లో ప్లాస్టిక్ ను మిలియన్ టన్నుల కొద్ది ఉపయోగించి పర్యావరణానికి ఎంతో హాని కలిగిస్తున్నాం.ఒక పాలిథీన్ క్యారీ బాగ్ భూమిలో కలవడానికి కొన్ని వేల సంవత్సరాల సమయం పడుతుంది.నీటిలో కూడా కలవదు. తద్వారా మనం జీవించే పర్యావరణం ఎంతో కలుషితమై కొన్ని విపత్కర పరిస్థితులను మానవ ప్రపంచం ఎందుర్కోవలసి వస్తుంది.

అయితే ఇప్పుడు పర్యావరణాన్ని సంరక్షించవలసిన బాధ్యత మన అందరిపై ఉంది. ప్రకృతిని పాడుచేసి తాను కూర్చున్న కొమ్మను తన చేతులతో తానే నరుకుంటున్నట్లు అవుతుంది. కాబట్టి మన పూర్వికులు మనకు అందించిన పర్యావరణాన్ని మనం రాబోయే భవిష్యత్ తరాలకు అందించవలసిన బాధ్యత ఎంతైనా వుంది.

**- హరిశ్చంద్ర**
**కొండవీటి డిగ్రీ కళాశాల.**

## చెట్టు వ్యథ... మనిషి కథ



నీవు పుట్టగానే పొత్తిళ్లుగా...
ఊగేందుకు ఊయలగా...
అడుగులు వేసేటప్పుడు
మూడుచక్రాల బండిగా...!
కూర్చునేటప్పుడు కుర్చీగా...
నిద్రించేటప్పుడు మంచంగా...
ఆకలేసినప్పుడు ఆహారంగా...!
నీవు బ్రతికేందుకు స్వచ్ఛమైన గాలినిస్తూ...
బదులుగా నీవిచ్చే కాలుష్యాన్ని మ్రింగేస్తూ...
నీ ఆనందానికి తోడుగా...
నీకొచ్చే వ్యాధులకు ఔషధంగా...!
నీవు నిలువునా నరికినా...
నీకు కలపనిస్తూ...
రాయేసి కొట్టినా కమ్మని ఫలాలనిస్తూ...!
పక్షులకు గూడుగా...
పశువులకు నీడగా...
అనేక జీవాలకు ఆశ్రయంగా...
వర్షానికి ఆధారమై...
భూగర్భజలాలకు అండయై...
నేలకోతను అడ్డుకుంటూ...
కరువు కాటకాలను తట్టుకుంటూ...
కాసిని నీళ్లు చిలకరిస్తే సంతోషంతో గంతులేస్తూ...!
సువాసనా పరిమళాల పూవులిస్తూ...
మధుర ఫలాలనిస్తూ...
ఆకుకూరలు,కాయగూరలతో నీకు ఆరోగ్యాన్నిస్తూ...
అన్నం,ఆధరువులతో నీ కడుపు నింపుతూ...
పప్పులూ,ధాన్యాలతో నీకు పుష్టి కలిగిస్తూ...!
చివరకు నీవు పోయేటప్పుడు
నీకు పాడె పల్లకినిస్తూ...
ఎన్నో...ఇంకెన్నో ఇస్తున్న తరువు...
నీ నుండి కోరేదేమిటి...?!
ఓ దోసెడు నీరు...!
ఆ మాత్రం దాహాన్ని
తీర్చలేవా నీవు...?!
నీ ధనదాహంతో
తరువులనెందుకు నరికేస్తావు...
మానవుడా!కృతఘ్నుడా!!.

చంద్రకళ. దీకొండ,
మల్కాజిగిరి,మేడ్చల్ జిల్లా.

## ఆచరణ కావాలి...

ప్రజాస్వామ్య భారతావనిలో
ప్రజాస్వామ్యం ఎంతవుందో
పర్యావరణ పరిరక్షణకు కూడా
అంతే ప్రాధాన్యత కనిపిస్తుం ది
ప్రజారోగ్యానికి
పర్యావరణం బాగుండాలి
అడవులను కాపాడాలి,
చెట్లను పెంచాలి.. అనే నినాదాలేగాని
ఆచరించేవారే కానరారు..
స్వచ్ఛభారత్ , క్లిన్ అండ్ గ్రీన్ వంటివి...కాగితాల్లోనే....
వాస్తవంలో కానరాని ఈ సమాజంలో..
పర్యావరణ పరిరక్షణ
నేతి బీరకాయ చందం కాకుండా ఉంటే బావుండును.

– గంధం రమణ,
రాజానగరం.

## తరువు బ్రతుకు తెరువు

ప్రకృతి మానవునికి ఓ అద్భుత వరం.
పచ్చదనం మనిషికే కాదు సకల జీవరాశుల
సమతుల్యాన్ని కాపాడే జీవవైవిధ్యం.
స్వచ్ఛమైన గాలి, నీరు, నేల
సమస్త జీవరాసుల మనుగడకు
సూచిక.అమ్మలాంటి తరువులు మనిషికి
ప్రాణాధారం.
చెడు గాలిని పీల్చి మంచి గాలిని ఇచ్చి
ఏ స్వార్థం లేకుండా మనిషికి సహకారం
అందిస్తూ
ప్రేమను పంచుతాయి.
భూతాపాన్ని తగ్గించాలన్నా
వర్షాలు కురిసి పంట పొలాలన్ని
సస్యశ్యామలం
కావాలన్నా ప్రకృతి
పచ్చదనంతో కళకళలాడుతూ పరిఢవిల్లాలన్న
మనిషి తన వంతు బాధ్యతగా పర్యావరణ
పరిరక్షణకు నడుం బిగించాలి.అడవుల్ని
కాపాడుకుంటూ మొక్కలతో ప్రకృతిని నింపాలి
పచ్చని చీరకట్టి అడివమ్మ భవిష్యత్ తరాలను
తన బడిలో సేద తీరుస్తుంది.
సమస్త మానవాళికి మేలు చేసే చెట్ల ఋణం
తలక్రిందులుగా తపస్సు చేసినా తీర్చలేం.
మనిషి కొక మొక్క
ఇంటికో ఇంకుడుగుంత
ఊరురా వనం
కాలుష్యాన్ని తగ్గించడమే
కాకుండా,పర్యావరణ సమతులనం చేస్తూ
పరస్పర సహకారంతో పంచభూతాల
సమన్వయం
జరిగి భూమండలం మానవాళి మనుగడకు
ఉనికికి అద్భుతమైన నేస్తమౌతుంది

– మోతుకుల నారాయణగౌడ్ తెలుగు
ఉపాధ్యాయులు,
రాజన్న సిరిసిల్ల జిల్లా.

## జగతికి పర్యావరణ రక్షణే ముఖ్యం!

ప్లాస్టిక్ వినియోగం మానాలి!
చెట్లను బాగా పెంచాలి!
అడవులను నరకకుండా చూడాలి!
అడవి జంతువేట నిషేధించాలి!
అధిక వాహన వినియోగం అరికట్టాలి!
కాగిత వినియోగం తగ్గించాలి!
ఏసీ ,ఎయిర్ కూలర్ల
వినియోగమరికట్టాలి!
చరవాణులను నియంత్రణలో
ఉంచాలి!
జలకాలుష్యం తగ్గించాలి!
వాయుకాలుష్యంపై దృష్టి సారించాలి!
ధ్వనికాలుష్యమధికం కాకుండా
చూడాలి!
భూతాపాన్ని తగ్గించాలి!
ఓజోన్ పొరకు విఘాతం కలుగకుండా
చూడాలి!
పర్యావరణ పరిరక్షణలో ప్రజలను
భాగస్వాములనుచేయాలి!
ప్రజలలో చైతన్యం తేవాలి!
పాఠ్యపుస్తకాలలో పర్యావరణ జాగృతి
కల్గించే పాఠ్యాంశాలను
పొందుపరచాలి!

– మల్లాది సోమేశ్వరశర్మ
విశాఖపట్నం.

# పర్యావరణ కవితామాలిక



చెట్లునాటిమనము
చెలిమిజేయవలెను,
ప్రాణవాయువిచ్చి
ఫలములొసగు,
మందుమాకులిచ్చి
మనలనురక్షించు,
మొక్కనాటవలయు నొక్కటైన!!

చెట్లపెంపకమ్ము
చేపట్టవలెనంత,
అడవివృద్ధిచెంది
యండనుండ,
మానవాళియంత
మనుగడసాగించు,
మొక్కనాటవలయునొక్కటైన!!

ఇంటికొక్కమొక్కనిలపైననాటి
న,
కంటిపాపవోలె కాచుచెట్టు,
ఆదరించునిన్ను అక్కున
జేర్చుకు,
మొక్కనాటవలయునొక్కటైన!!

– తాళ్లపల్లి భాగ్యలక్ష్మి,
రాజన్న సిరిసిల్ల జిల్లా.

## చిన్నబోయిన ప్రకృతి

ఆకాశం అందం ఆవిరైంది
ప్రయోగాలు, ఫలితాలు...
ప్రకృతి పాడైపోయె...నగములు
నగుమెమాయె..అందం
ఆవిరాయె..సుఖాలునశించె.
పరిశ్రమలొచ్చాయి, కాలుష్యం పెరిగింది.
వాహనాలు పెరిగాయి...
వాయు కాలుష్యం పెరిగింది,
ప్రకృతి నిండా వ్యర్దాలు...అంతా కలుషితం.
ఆవాసాలు అనంతం.
జలవనరులు అదృశ్యం.
వృక్ష సంపదఅంతరించె...
ఉష్ణోగ్రత పెరిగె....
ధరణి విషపుకోరలపాలాయె....
ఆకాశాన్ని కాపాడుదాం...
చెట్లు పెంచుదాం...నదుల్ని కాపాడుదాం...
ఇది అందరి బాధ్యత.
చిన్న బోయిన ప్రకృతిలో
చిరు నవ్వులు చూద్దాం!!

– డా.టి.పార్థసారథి,
ప్రకాశం డిగ్రీ కళాశాల, కొయ్యలగూడెం.

## 'నా' అభ్యర్థన

"నేను" అమ్మలా
అందరి క్షేమం కొరతాను,
అనేక లక్షల కోట్ల జీవ,
నిర్జీవాల సమూహాన్ని "నేను"
"నాలోని" భాగంగా
పంచభూతాలు అన్నింటినీ
ఇమడ్చుకున్నాను....
అంతేకానీ ప్రస్తుత పరిణామాలకు
కారణం "నేను" కాను.
"భూదేవి"లా ఎంతో
సహనంతో ఉంటాను
కానీ ఎద్దైనా మితిమీరితే
"నేనూ" సహించలేను.,
"ఆది పరాశక్తిని" అవుతాను...
"నేను" అనుకొనే "నాకు" స్వార్థం అనేది లేనేలేదు.
కానీ ఎప్పుడైతే, "నా"లో భాగం అయిన మనుషులు వారి స్వార్థం కోసం"నాకు" హాని కలిగించాలని చూస్తారో, అప్పుడు "నాలోని" పంచభూతాలు ఉక్రోషించి, "నేను" ఉప్పెనలా ముంచుకొస్తాను.....

**మనవి :** అమ్మ పరిరక్షణా బాధ్యత మనలో ఎంత ఉంటుందో, అలానే మన పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే ఆలోచనా బాధ్యత మనందరిలో ఉండాలి... మన ప్రకృతిని కాపాడుకొని, మనల్ని మనం కాపాడుకుందాం...

– జి.ప్రసన్న రాణి,
డిగ్రీ ఫైనల్, నైపుణ్య డిగ్రీ కళాశాల,
ప్రత్తిపాడు.

## పర్యావరణం

మన చుట్టూ ఉన్న ఆవరణమే –
పర్యావరణం.
చెట్టు– గాలి – నీరు మరియు నేలలు!
పర్యావరణంలో మానవుడు ఒక భాగం!
పర్యావరణం ప్రకృతి యొక్క వరం!
పరిరక్షణ – మన బాధ్యత!
దానిని మనం రక్షిస్తే అది మనల్ని
రక్షిస్తుంది!
చెట్లు ప్రగతికి
మెట్లు – చెట్ల వల్ల వర్షాలు కురుస్తాయి!
వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్
గ్రహించి, మనకి ఆక్సిజన్ని అందిస్తాయి!
చెట్లు నేలలసారాన్ని పరి రక్షిస్తాయి!
చెట్లని నరకడం నేరం!
నేటి మొక్క– రేపు బోధి వృక్షమై
బుద్ధిని ఇస్తుంది!
గాలి భూమండలం చుట్టూ
ఆవరించబడి ఉంది!
వాహనాలు పరిశ్రమలవల్ల
వాయు కాలుష్యం..
వీటివల్ల రోగాలు వ్యాపిస్తున్నాయి!
సమస్త జీవులకు నీరు జీవనాధారం!
పరిశ్రమల వల్ల
నీరు కాలుష్యం అవుతుంది!
నేలపై భాగంలోని సన్నని మట్టి పొరలను
హ్యూమస్ అంటారు!
అతిగా వాడే కృత్రిమ ఎరువుల వల్ల నేల
కాలుష్యం!
ప్రకృతి – దేవుని ప్రతిరూపం!!
దానిని కాపాడుదాం!

– కవిత దాస్యం,
కోదాడ

## పర్యావరణం



పచ్చని,స్వచ్ఛమైన
వాతావరణం..మన
పర్యావరణం.
ప్రకృతి పరిస్థితులు విచిత్రము,
దాని కాలం.. ఒక యుగము యజ్ఞమే.మానవుడు
జీవనం కొరకు పర్యావరణ
సమతుల్యత కోసం
నాడు విత్తిన మాటలు
నిన్న సమతుల్యతగా ఉన్నాయి.నేడు..?
ప్రకృతి ఓ యౌవనపు స్త్రీ
సుందరపు రూపాన్ని ధరించింది.
కాలగర్భాన్నికనికరంతో మోస్తుంది.
కన్నీటిని భద్రం చేస్తుంది
చెరిపిన వ్యవస్థను
ఓర్పుతో అణుచుకొంటుంది.
సహనం అను తెరను కప్పుకొంటుంది.
సృష్టి ఆరంభానికి
ఆర్భాటించలేదు.
నాశనానికి సంతోషపు పునాదులను
పురిటినొప్పులకు కూడా పట్టనంత సమయంలో
పచ్చని పర్యావరణాన్ని శిక్షించి
నాశనం ద్వారాలను తెరుస్తున్నాం.
క్షేమానికి ముందు నిర్లక్ష్యానికి సహకరిస్తే జీవం..
ఇక క్షామమే!!
ఇకపై విడిచిన ప్రతి
కన్నీటిబొట్టుకుజి
ఈ యుగము
ఊపిరితో ఊగిపోతుంది.

– కొమరపు సురేష్,
పి.ఆర్.కళాశాల,కాకినాడ

## ప్రకృతి రూపం అపురూపం

ప్రకృతి రూపం అపురూపం..!
అపురూపం లోని ఓ రూపమే మనిషి.
నేడు...ఊసరవెల్లిలా
రూపాల్ని మారుస్తూ,
ప్రకృతిరూపాల్ని కాలరాస్తున్నాడు.
ఈ జగత్తు పంచభూత మయం.
ఓ మనిషీ! లోకాల్ని నిలిపి ప్రాణుల్ని నడిపించే శక్తులతోనా నీ చెలగాటం?
అనునిత్యం నీ అభివృద్ధికి కృషి చేసే వాటిని కలుషితం చేస్తూ,మసి చేస్తున్న ఓ మనిషీ!
ఒక్కసారి,నీ మనసుతో ఆలోచించు!
నింగి,నేల,నిప్పు,నీరు ,గాలితో,
సౌఖ్యంతో, సౌభాగ్యంతో మెలగాల్సిన జీవితాన్ని
వికృత శక్తుల్ని సృష్టించి వినాశనాన్ని కలిగిస్తున్నావ్.
సమస్త వినాశనానికి సుమార్గం వేస్తున్నావ్.
ప్రకృతే ప్రగతికి ప్రబోధమన్న మాటను మరిచి, ప్రాకృతిక శక్తుల్ని ప్రళయకాల శక్తులుగా మార్చి,విధ్వంసాన్ని ఆహ్వానిస్తున్నావ్.
పునః సృష్టిని చేస్తున్నావనే గర్వంతో,మాతృ సృష్టిని కాలరాస్తున్నావ్.
నీ అహంకార నిప్పును చల్లార్చుకో..!
ప్రకృతి శ్రేయస్సును ప్రారంభించి,ప్రపంచాన్ని రక్షించు..!ప్రశాంతంగా జీవించు..!

–డా.పసుపులేటి నాగమల్లిక
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
రామచంద్రపురం.